శీర్షిక: తొలకరి

# "ఆ చూపులు..."

## - మండపాక శివప్రసాద్

ఎదురింటి డాబాలో కొత్తగా దిగిన కుర్రాడు తనని అదే పనిగా చూస్తున్నాడని ఆమె గమనించకపోలేదు. నీళ్ళ కోసం డాబాలోకి వెళ్ళినప్పుడల్లా తనవైపే గుచ్చి గుచ్చి చూసేవాడు. పేరు రమేష్. డిగ్రీ ఫైనల్ చదువుతున్నాడు. అతని వయసుకీ, తన వయసుకీ చాలా వ్యత్యాసమున్న విషయం ఆమె గ్రహించింది. ఆ కళ్ళ వెనుక దాగున్న కోరికలను ఆమె కనిపెట్టింది.



ఆమె – శారద.

ఆమె నీళ్ళకు రాగానే ఏదో పని వున్నవాడికిమల్లే అతను వంటగదిలోకి వచ్చేవాడు. మధ్యాహ్నం వసారాలో కూర్చుంటే కిటికీలోంచి చూపుల బాణాలు విసిరేవాడు. ఆమెకూ ఈ అనుభవం కొత్తగా వుంది.

ఆ రోజు శుక్రవారం. పని అంతా ముగించింది. తలస్నానం చేసి దొడ్లో పూచిన మందారాలు రెండిటిని తల్లో పెట్టుకుంది. చెల్లెళ్ళు ఇద్దరూ స్కూలుకు వెళ్ళారు. పాత వీక్లీని చేత పుచ్చుకుని వసారాలో చాపమీద నడుం వాల్చింది. ఎదిరింటి రమేష్ కిటికీలోంచి ఆమెనే చూస్తున్నాడు. అసలు చెప్పకోవాలంటే అతను అలా చూడాలనే ఆమె అక్కడ నడుం వాల్చింది. పుస్తకం చూస్తున్నదన్న మాటేగానీ ఆమె ఆలోచనలు ఇక్కడలేవు. ఆ ఆలోచనలతో కళ్ళు బరువెక్కాయి. అనుకోకుండా నిద్రలోకి జారుకుంది.

ఆ నిద్రలో కల... పగటి కల.

"శారదా! శారదా!!" అంటూ మత్తు స్వరంతో ఎదిరింటి రమేష్ పిలుపు. చేతిలో గులాబి. కళ్ళల్లో కొత్త కోర్కెలకు రెక్కలొచ్చిన జాడలు.

ఆమె కళ్ళల్లో దెబ్బ తగిలితే మందువేసి ఓదార్చే మాతృత్వపు భావన.

చనువుగా దగ్గరకొచ్చి గులాబీని శారద తలలో పెట్టాడు.

బదులుగా ఆమె దగ్గరకు తీసికుని బుగ్గపై ఓ ముద్దిచ్చింది.

అతనూ తన చెంపను తడుముకుని శారదకూ గట్టిగా ఓ ముద్దిచ్చాడు.

ఆ తీవ్రతకి ఆమె బుగ్గ ఎర్రగా కందింది.

"శారదా!" అన్న తండ్రి గట్టి పిలుపుతో కల చెదిరి శారద ఈ లోకంలోకి వచ్చింది. మధ్యాహ్నం భోజనానికి తండ్రి ఇంటికొచ్చాడు.

రాజారావు పెద్ద కూతురైన శారద పెద్ద అందగత్తె కాదు.. అలాగనీ అనాకారీ కాదు. మామూలు మనుషుల మీద కొంచెం బాగానే వుంటుంది. ముగ్గురు ఆడపిల్లల్లో పెద్దదైన ఆమెకు, పెళ్ళీడు దాటింది. రాజారావుకి ఒకప్పుడు బట్టలు దుకాణం వుండేది. వ్యాపారంలో మెళకువలు తెలియక, తెలుసుకోలేక దాన్ని మూసేశాడు. అప్పటినించి ఓ పెద్ద బట్టలకొట్టులో గుమాస్తా చేస్తూ బతుకు బండిని నెట్టుకొస్తున్నాడు. శారద తల్లి గతించి చాలాకాలం అయింది. ఇప్పుడు శారదే ఇంటికి పెద్ద దిక్కు. తండ్రికి వచ్చే కొద్దిపాటి జీతాన్ని జాగ్రత్తగా ఖర్చుపెడుతోంది. దానికితోడు పెరట్లో కాయగూరలు అవీ పెంచి, చుట్టుప్రక్కల వారికి అమ్మి కొంత సంపాదిస్తోంది.

చాలాకాలం క్రిందట రామకోటి ఆమెని పెళ్ళి చేసుకుంటావని అన్నప్పుడు శారద మనసు చాలా ఊగిసలాడింది. రామకోటి తండ్రిని ఎదిరించి రమ్మన్నాడు. శారదకు అంతటి ధైర్యం ఎక్కడిది? నీతి నియమాలు, ఆంక్షలు, కట్టుబాట్లు ఆమెను అడ్డుకున్నాయి.

***

రాజారావుకి యజమాని రమ్మంటున్నాడని కబురందింది. అప్పుడే దిగిన బట్టల తానులను అరల్లో సర్దుతున్న రాజారావుకిది ఒకింత ఆశ్చర్యం వేసింది. యజమాని అతన్ని ఎప్పుడోగానీ పిలువడు. విశేషం ఏమిటో అనుకుంటూ యజమాని చర్సనల్ రూంలోకి వెళ్ళాడు.

రోజూ వ్యాపార చికాకులతో చిరుబురులాడే ఆయన ఈ రోజు కాస్త తేటగా వున్నాడు. వెళ్ళగానే రాజారావుని నవ్వు మొహంతో "రా... రాజారావు!" అని ఆహ్వానించాడు చక్రపాణి.

నమస్కారం చేసి రాజారావు వినయంగా నించున్నాడు.

"రాజారావు... నీకు ముగ్గురూ ఆడపిల్లలే అనుకుంటా!" అన్నాడు చక్రపాణి.

అవునని తలూపాడు రాజారావు.

"అదే... మన హెడ్ గుమస్తా చెప్పాడు... మీ పెద్దమ్మాయి సంగతి! నీకు ఇష్టం అయితే ఆ అమ్మాయిని మా పెద్దబ్బాయికి చేసుకుందామనుకొంటున్నా... నీకు తెలుసుగదా, వాడికేమో కళ్ళు లేవు. పుట్టు గుడ్డి. వాడ్ని సరిగా చూసుకునే అమ్మాయి కోసం ఇంతకాలం చూస్తున్నాం" అన్నాడు చక్రపాణి.

"చెప్ప రాజారావు! నా కిద్దరే కొడుకులు. పెద్దోడికి పెళ్ళి అయితేనేగానీ, చిన్నోడికి వీలులేదు. అమ్మాయిల పెళ్ళిళ్ళు ఎప్పుడో అయిపోయాయి. ఇక నా ఆస్తికివారసులు వాళ్ళిద్దరే కదా? మరి నువ్వేమంటావు? నీకు ఇష్టం అయితే చెప్ప.. త్వరలోనే పెళ్ళి ఏర్పాట్లు చేసుకుందాం" అన్నాడు చక్రపాణి.

ఏ మాటా చెప్పలేక రాజారావు మౌనంగా బయటకొచ్చాడు. బయటకు రాగానే హెడ్ గుమస్తా అతని దగ్గరకొచ్చి, ఓ వంకర నవ్వు నవ్వి "నీకు అదృష్టం పట్టబోతోంది. ఆలోచించుకో! ఇప్పుడు నువ్వున్న పరిస్థితుల్లో పెద్ద పిల్ల పెళ్ళిచేయడం నీ వల్ల కాని పని" అన్నాడు.

హెడ్ గుమాస్తా మాటలు రాజారావులో ఆలోచనలు రేపాయి. నిశ్చలంగా వున్న చెరువు నీటిలోకి రాయిని విసిరితే రేగే అలల మాదిరి మనసులో ఆక్షణాన ఆలోచనా సుడులు రేగాయి.


"ఈ పెళ్ళి నా కొద్దు!" అని శారద తండ్రితో చెబుదామనుకుంది. జీవితాంతం అవివాహితగానే వుందామనుకుంది. కానీ ఆమె వెనుక ఇద్దరు చెల్లెళ్ళున్నారు. ఈ పెళ్ళికి ఒప్పుకుంటే కుటుంబ సమస్యలన్నీ తీరిపోతాయని ఆలోచించింది. అందుకే తండ్రి సంబంధం ఖాయం చేసుకొచ్చానని, వచ్చే నెల పెళ్ళి అన్నప్పుడు మనసులో రేగిన భావాలను అణిచిపెట్టుకుంది. అయినా ఆమె ఇష్టాలతో అక్కడ పనిలేదు. అసలు ఆ ఇంటిలో ఇష్టాలను ప్రదర్శించడం ఎప్పుడో మానేసింది శారద.

పెళ్ళి ముందు ఓ రోజు శారద గుడికెళ్ళింది. దణ్ణం పెట్టుకొని ఆమె ఇవతలకు వస్తుండగా- ప్రక్కనే రమేష్ నుంచున్నాడు.

"నీతో కొంచెం మాట్లాడాలి" అన్నాడు రమేష్

"నీ పెళ్ళట కదా!" అన్నాడు రమేష్ మొదటిగా.

"అవును" అంది శారద ముక్తసరిగా.



"శారదా... నిన్ను ప్రేమిస్తున్నా... పెళ్ళి చేసుకోవాలనుకున్నా... నీ పెళ్ళి కుదిరిందని తెలిసి నా మనసు ఎంత బాధ పడుతూదో"అన్నాడు.

"చూడు రమేష్.. నేను నీ కన్నా ఎంతో పెద్దదాన్ని. నువ్వు నన్ను ప్రేమిస్తున్నావు అంటే నమ్మే వయసులో లేను నేను. నీది ప్రేమ కాదు. ఒక విధంగా చెప్పాలంటే అది వయసు వేడి. ఈ వయసు వేడిలో నిన్ను నీవు మర్చిపోతున్నావు" అంది శారద.

ఆ మాటలకు రమేష్ గుడ్లప్పగించి శారద వంక అయోమయంగా చూసాడు.

***

శారద పెళ్ళి చక్రపాణి కొడుకుతో జరిగిపోయింది. పెళ్ళితో ఆమె కుటుంబ పరిస్థితులు మారిపోయాయి. డబ్బున్న అల్లుడు రావడంతో రాజారావులో ఉత్సాహం వచ్చింది.

శారద భర్తకు కళ్ళు లేవు. పుట్టు గుడ్డి. అన్నీ శారదే చూసుకోవాలి. ఆ ఇంట్లో ఆమెకు అన్నీ అందుతున్నా మనసులో ఏదో తెలియని లోటు.

తల్లి సంవత్సరీకం అవ్వడంవల్ల శారద పుట్టింటికొచ్చింది. ఇప్పుడు పాత పెంకుటిల్లు స్థానంలో డాబా వచ్చింది. చుట్టూ ప్రహరీ... మధ్యలో గేటు.. ఇంతకు ముందున్న ఖాళీని డాబా చాలా వరకూ మింగేసింది. సన్నజాజి పందిరి స్థానంలో పంపు ఏర్పడింది.

పెద్ద చెల్లెలు స్కూలు నించి ఇంటికి రాగానే "ఎదిరింటి ఇంజనీర్‌గారి అబ్బాయి ఇక్కడే వుంటున్నాడా... డిగ్రీ పూర్తయిందా?" అని అడిగింది శారద మాటల మధ్యలో.

"వాళ్ళబ్బాయికి స్కూటర్ యాక్సిడెంట్ అయింది. హాస్పిటల్లో వున్నాడు" అంది చెల్లెలు.

"బాగా దెబ్బలు తగిలాయా?" అడిగింది శారద ఆత్రుతతో.

"ఏమో అక్కా... నాకూ పెద్దగా తెలియదు" అంది చెల్లెలు.

పది రోజుల తరువాత ఒక రోజు ఎదురింటి ముందు అంబులెన్స్ ఆగింది. అందులోంచి రమేష్ తల్లి ఏడుస్తూ ముందు దిగింది. తరువాత రమేష్‌ను తండ్రి చెయ్యి పుచ్చుకుని దింపుతున్నాడు.

తండ్రి చేతిని పుచ్చుకుని రమేష్ వాకింగ్ స్టిక్‌తో మెల్ల మెల్లగా నడుస్తున్నాడు. ఏమయిందో శారదకు అర్థంకాలేదు. సరిగ్గా చూద్దామంటే అంబులెన్స్ అడ్డంగా వుంది. ఉండబట్టలేక ఇంటి ప్రక్కనున్న కాంతమ్మను "ఇంజనీర్‌గారబ్బాయికి ఏమయింది?" అని అడిగింది.

"ఇంకా తెలియదా శారదమ్మా... అతనికి రెండు కళ్ళు పోయాయి. అసలు ఈ కాలం కుర్రోళ్ళను పట్టుకోగలమా... ఫ్రెండ్ స్కూటర్ మీద సినిమాకెళ్తుంటే, లారీ వెనుక నుంచీ గుద్దేసిందట... దెబ్బ బాగా తగిలిందట... దానితో చూపు పోయింది. కర్మకాకపోతే ఏమిటమ్మా ఇది!" అన్నది కాంతమ్మ.

రమేష్‌కి కళ్ళు పోయాయా!?

శారద ఆ మాటలను జీర్ణించుకోలేకపోతోంది. ప్రేమగా పెంచుకుంటున్న పూలతీగ నెవరో నిర్దాక్షిణ్యంగా తెంపేసినట్టు ఫీల్ అయింది. కుర్చీలో నీరసంగా కూలబడింది. కళ్ళ ముందు పెద్ద పెద్ద నల్లటి తెరలు దింపినట్టుగా అన్పించింది. క్షణ కాలం ఆమె కూడా గుడ్డిదయింది.

కొంతసేపటికి తెప్పరిల్లి, ఎదురింటి కిటికీ వంక చూస్తూ "ఇంక ఆ చూపులు కూడా తవకి లేవు" అని గొణుక్కుంది శారద. *